ప్రజాశక్తి
శనివారం 13 జూలై 2024 8 పేజీలు


గుంటూరు


పల్నాడు

మిర్చి ధరల పతనం

గరిష్ఠంగా 16 వేలకు పడిపోవడంతో డీలాపడ్డ రైతు - కోల్డ్ స్టోరేజీల్లో నిల్వకే ప్రాధాన్యం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

మిర్చి ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు యార్డుకు సరుకు ఎక్కువగా తీసుకు రావడంలేదు. అంతేగాక తమ సరుకును మరికొద్ది రోజులు కోల్డ్‌స్టోరేజీల్లోనే నిల్వ చేయాలని రైతులు నిర్ణయం తీసుకున్నారు. గుంటూరులో మిర్చి ధరలు కొన్ని రోజులు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. శుక్రవారం ఈ ధరలు మరింత తగ్గాయి. ధరలు పడిపోవడంతో రైతులకు నిరాశ ఎదురైంది. గతేఏడాది ఇదేసమయంలో సగటు ధర క్వింటాళ్‌కు రూ.20 వేల నుంచి రూ.24 వేల వరకు ఉండగా ఈ ఏడాది గరిష్ఠంగా రూ.16 వేలు దాటడం లేదు.



శుక్రవారం యార్డుకు 21,027 టిక్కీలమిర్చి రాగా పాత నిల్వలతో కలిపి 25,626 టిక్కీలు విక్రయించారు. ఇంకా 12,347 టిక్కీలు నిల్వ ఉన్నాయి. నాన్ ఎసి కామన్ వెరైటీలు సగటున కనిష్ఠ ధర రూ.8వేలు పలకగా గరిష్ఠంగా రూ.16 వేలు పలికింది. నాన్ ఎసి స్పెషల్ వెరైటీలు కనిష్ఠంగా రూ.8 వేలు, గరిష్ఠంగా రూ.18,500 లభించాయి. ఎసి కామన్ వెరైటీలు సగటు కనిష్ఠ ధర రూ.8500, గరిష్ట ధర రూ.16,500 పలికాయి. స్పెషల్ వెరైటీలు తేజ, బాడుగ రకాలు కనిష్ఠంగా రూ.8500, గరిష్ఠంగా రూ.18 వేలే పలికాయి. అయితే గత ఏడాది జులైలో క్వింటాల్ మిర్చి కనీస ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.24 వేలు పలికాయి. బాడిగ మంచి రకానికి చెందిన మిర్చి ధర గతంలో రూ.33 వేల వరకు పలకగా ప్రస్తుతం రూ.18 వేలు పలకింది. మిగిలిన అన్నిరకాల మిర్చి ధరలు గణనీయంగా తగ్గాయి.

ధరలు తగ్గడంతో రైతులు, వ్యాపారులు ఎక్కువగా కోల్డ్ స్టోరేజీల్లో సరుకు నిల్వ చేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 70 లక్షల మిర్చి బస్తాలు నిల్వ ఉన్నాయని అధికారులు తెలిపారు. మార్కెట్‌లో మిర్చి అవసరం తగ్గడం, మూడునెలలుగా వివాహాది శుభకార్యాలు లేకపోవడం వల్ల గృహ వినియోగానికి మిర్చి వినియోగం తగ్గడం వల్ల కూడా ధరలు కొంత మేరకు తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు. వచ్చేనెలలో తిరిగి శుభ కార్యక్రమాలు ప్రారంభమైతే ధరలు కొంత మేరకు పెరగవచ్చని అంచనా

▸ 2లో



కాన్వాయ్ ఆపించి వినతులు తీసుకున్న సిఎం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం కాన్వాయ్ ఆపి సామాన్య ప్రజలను కలిశారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి సచివాలయానికి వెళుతున్న సమయంలో కరకట్టపై ఉన్న ప్రజలను చూసి తన కాన్వాయ్‌ను ఆపించారు. సమస్యలపై వినతులు అందించేందుకు వచ్చిన ప్రజలను పిలిచి మాట్లాడారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వారు తమ సమస్యలు చెప్పుకున్నారు. అనంతరం వారి నుండి వినతిపత్రాలు తీసుకుని పరిష్కారానికి హామీనిచ్చారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అర్ధరాత్రి తనిఖీలు

బయటపడ్డ ఈసిజి టెక్నిషియన్‌ల పని తీరు - ఈసిజి రోల్స్ బయటకు వెళుతున్నాయి : సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

8 లో



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

దినసరి కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయం

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే దినసరి కార్మికులకు (ఎన్ఎంఆర్ వర్కర్స్) 2024-2025 సంవత్సరానికి రోజువారీ వేతనాలను కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ నిర్ణయించింది. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధ్యక్షతన కలెక్టర్ చాంబర్‌లో కమిటీ సమావేశం నిర్వహించారు. ఎన్ఎంఆర్ కార్మికులకు రోజువారీ కూలీగా అత్యంత నైపుణ్యం కలిగిన వారికి రూ.870, నైపుణ్యం కలిగిన వారికి రూ.825, పాక్షిక నైపుణ్యం ఉన్న వారికి రూ.715, నైపుణ్యం లేని వారికి రూ.600 వేతనం నిర్ణయించారు. ఈ వేతనాలు 2024 ఏప్రిల్ 1 నుండి 2025 మార్చి 31 వరకూ అమలులో ఉంటాయి. సమావేశంలో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, ఆర్అండ్‌బి ఎస్ఇ, ఇరిగేషన్ ఎస్ఇ, ఎపిసిపిడిసిఎల్ ఎస్ఇ, పంచాయతీ రాజ్ ఎస్ఇ, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ నుండి తాగునీరిస్తాం

- పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- ఎండిపోతున్న వినుకొండలోని సింగర చెరువుకు పరిశీలన

4 లో

పల్నాడులో డైయేరియా

- జిల్లాను పట్టిపీడిస్తున్న వ్యాధి
- పిడుగురాళ్లలో అధికారకంగా ముగ్గురు మృతి
- రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు
- గ్రామాలకూ వ్యాపిస్తుండడంతో భయాందోళన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పల్నాడు ప్రాంతం నేడు డయేరియా గుప్పిట విలవిల్లాడుతోంది. బాధితులు రోజురోజుకూ పెరుగుతుండడంతో జనాలు బెంబెలెత్తిపోతున్నారు. ముఖ్యంగా పిడుగురాళ్ల, మాచర్ల రూరల్ మండలాల్లో నిత్యం నమోదవుతున్న కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. డయేరియాతో ఇప్పటికే పిడుగురాళ్లలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు దేవరత్నం, మున్సిపల్ కార్మికుడు పరస బాలకృష్ణ, తిరుమలగిరి ఆంజనేయులు, బండారు వెంకటేశ్వర్లు (బోడియ్య), తమ్మిశెట్టి తిరుపతమ్మ మృత్యువాత పడ్డారు. గతంలో డయేరియా బారిన పడినా రెండు మూడ్రోజులు చికిత్స పొందితే కోలుకునేవారు. అయితే ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గత 10 రోజులుగా వ్యాధి అదుపులోకి రావడం లేదు. ఇందుకు కారణాన్నీ అధికారులు ఇతిమిద్ధంగా చెప్పలేకపోతున్నారు. పారిశుధ్య సమస్య ఒక కారణం కాగా తాగు నీరు సరఫరాలోనూ సమస్య ఉన్నట్లు చెబుతున్నారు. పరీక్షల నిమిత్తం నీటి నమూనాలు సేకరించినా ఫలితాలేమిటో ఇంకా వెల్లడించలేదు. సమస్య మెదలైన కొద్ది రోజులపాటు స్థానిక అధికారులు సరైన రీతిలో స్పందించకపోవడం, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, తాగునీటి సరఫరాలో క్లోరినేషన్ లేకుండా సరఫరా, అధికారుల పూర్తి స్థాయి పర్యేవక్షణ లేకపోవడం వల్ల సమస్య తీవ్రమైందనే విమర్శలు వస్తున్నాయి.



పిడుగురాళ్ల పట్టణంలోని లెనిన్ నగర్, మారుతి నగర్‌లో ఎక్కువగా కేసులు నమోదవడం, దాచేపల్లి మండల పరిధిలోని కేశానుపల్లిలో గత నెలలో 21వ తేదీ నుండి 30వ తేదీ మధ్యలో 15కు పైగా డయేరియా కేసులు నమోదయ్యాయి, మాచవరం మండల పరిధిలో సైతం డయేరియా కేసులు నమోదైనట్లు స్థానికులు చెబుతున్నారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలో ఇటీవల కారంపూడి, దుర్గి, రెంటచింతల

▸ 2లో



డిగ్రీ 4వ సెమిస్టర్ ఫలితాల్లో 'వాగ్దేవి' విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గురువారం ప్రకటించిన డిగ్రీ 4వ సెమిస్టరు ఫలితాల్లో వాగ్దేవి డిగ్రీ కళాశాల బీఎస్సీ, బీకాం విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించి పట్టణ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎంపిసిఎస్ విభాగంలో ఎ.కోటేశ్వరమ్మ 900 మార్కులకు గాను 867 మార్కులు, ఎస్.కె మాలిన్ 865 మార్కులు, బి.ప్రవల్లిక 862 మార్కులు, ఎంఎస్.సిఎస్ విభాగంలో పి. ప్రవల్లిక 850 మార్కులు, జి.హరివెంకట నాగసుస్మిత 839 మార్కులు, బి.స్రవంతి 900 మార్కులకు గాను 830 మార్కులు, బికాంలో ఎం.అంజలి 800 మార్కులకు గాను 727 మార్కులు, ఎం.త్రివేణి 711 మార్కులు, జానీబాషా 709 మార్కులు సాధించారన్నారు. తమ విద్యార్థులు 90 శాతం పైగా సాధించారని చెప్పారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్, స్టాటిటిక్స్‌లో నూరు శాతం మార్కులు వచ్చాని కళాశాల సెక్రటరీ - కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు , మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్‌బాబు, పాశం కృష్ణారావు, ఇస్కే పల్లి కృష్ణకిషోర్, అధ్యాపకులు సిబ్బంది అభినందించారు.



డిగ్రీ ఫలితాల్లో 'కృష్ణవేణి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గురువారం విడుదల చేసిన ద్వితీయ సంవత్సరం బీఎస్సీ, బీకాం కంప్యూటర్స్ 4వ సెమిస్టర్ డిగ్రీ ఫలితాల్లో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు అన్ని గ్రూపులలో యూనివర్సిటీ స్థాయి మార్కులు సాధించడంతో పాటు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు.తమ విద్యార్థులు పి.పద్మలీల బి.ఎస్.సి (ఎం.ఎస్.సి.ఎస్) 900 మార్కులకు గాను 873 మార్కులు, కె.వెంకటలక్ష్మి 872 మార్కులు, ఎస్.కె మున్ని బీఎస్సీ (ఎంబిసిసిఎస్)లో 1000 మార్కులకుగాను 964 మార్కులు, జి.శైలజ బిఎస్.సి ఎంసిసిఎస్‌లో 900 మార్కులకుగాను 836 మార్కులు, వై.నాగలక్ష్మి 830 మార్కులు, ఎం.సౌజన్య బీఎస్సీ (బిజెడ్‌సి)లో 1000 మార్కులకు గాను 921 మార్కులు, బి.జ్యోతి బీకాం కంప్యూటర్స్‌లో 800 మార్కులకు గాను 734 మార్కులు సాధించారని వివరించారు. తమ కళాశాలలో అనుభవం కలిగిన అధ్యాపకులతో బోధనతో పాటు ఆటపాటలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను అభినందించారు. అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.యోగేశ్వరరావు, ఎస్.డి సర్దార్ జానీ హుస్సేన్, మల్లారెడ్డి, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇవ్వాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు : పెదకూరపాడు రైల్వేస్టేషన్‌లో పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్ట్ ఇవ్వాలని దక్షిణ మధ్య రైల్వే జిఎం అరుణ్ కుమార్‌ను ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కోరారు. పల్నాడు జిల్లాలో రైల్వేకు సంబంధించిన పలు సమస్యలపై ఇచ్చిన వినతి పత్రంలో పెదకూరపాడు అంశాన్ని చెర్చడమే కాకుండా ప్రత్యేకంగా ప్రస్తావించారు.

నాగసరపు సుబ్బరాయ శ్రేష్ఠి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎస్ఎస్ఎన్ కళాశాల వ్యవస్థాపకులు నాగసరపు సుబ్బరాయ శ్రేష్ఠి సేవలు చిరస్మరణీయమని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన 67వ వర్ధంతి సభలో సుబ్బరాయ శ్రేష్ఠి విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఇదే కాలేజీలో చదివానని గుర్తు చేసుకున్నారు. 1950లో ఉన్నత ఆశయంతో నెలకొల్పబడిన కళాశాలలో పూర్తిస్థాయి డిగ్రీ కళాశాలగా మారడంతో తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర విద్యార్థులు సైతం విద్యనభ్యసించారన్నారు. ఇక్కడ చదివిన ఎందరో ఉన్నత స్థానాలలో స్థిరపడ్డారని చెప్పారు. కళాశాల సెక్రటరీ - కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, పాలకవర్గ అధ్యక్షులు కాపలవాయి విజయ్‌కుమార్ మాట్లాడుతూ తమ పెద్దలు ఏ ఆశయంతో కళాశాల స్థాపించారో అదే ఆశయంతో కొనసాగిస్తామన్నారు. మొదట ఆంధ్రా విశ్వవిద్యాలయానికి తర్వాత ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి అనుబంధ కళాశాలగా పురోగతిని సాధించిందన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, పోస్ట్-గ్రాడ్యుయేట్ స్థాయిలో వివిధ కోర్సులను అందిస్తోందని, వ్యవసాయం, పశుసంవర్ధక, ప్రాథమిక విద్య, నర్సింగ్ విద్యకు సంబంధించిన ఇతర ప్రొఫెషనల్, డిప్లొమా కోర్సులు, సైన్స్ సబ్జెక్టుల కోసం పూర్తి స్థాయిలో లేబొరేటరీలు, విశ్వవిద్యాలయంచే ఉత్తమ గ్రంథాలయ పురస్కారం పొందిన విశాలమైన లైబ్రరీ, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ అన్ని సదుపాయాలతో నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని, తదితరులు పాల్గొన్నారు.



సుబ్బరాయ శ్రేష్ఠి విగ్రహానికి పూల మాలేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు, కళాశాల పాలకవర్గ సభ్యులు

పల్నాడులో 'డై'యేరియా

(మొదటి పేజీ తరువాయి)

మండలాల్లో డయేరియా కేసులు 100కు పైగా నమోదైనా ప్రస్తుతం కేసులు తగ్గుముఖం పట్టి రోజుకు 3-5కు పరిమితమైనట్లు తెలిసింది. పిడుగురాళ్లలోని లెనిన్ నగర్, మారుతి నగర్ ప్రాంతాల్లో ఈ నెల 3వ తేది నుండి 12వ తేది వరకు సుమారుగా 200కు పైగా డయేరియా కేసులు నమోదయ్యాయని అధికారులు చెబుతున్నారు. ముగ్గురు మృతి చెందినట్లు చెబుతున్నా వాస్తవానికి ఈ సంఖ్య ఐదుగా స్థానికులుంటున్నారు. రెండుమూడ్రోజులుగా పట్టణంలోని అనేక ప్రాంతాల్లో కేసులింకా నమోదవుతూనే ఉన్నాయి. మండల పరిధిలోని కోనంకిలో కూడ డయేరియా విజృభిస్తోంది. పల్నాడు జిల్లా వ్యాప్తంగా రోజుకు సుమారు 20-30 కేసులు అధికారకంగా నమోదవుతున్నాయి. పిడుగురాళ్ళలోఈ నెల 8, 9 తేదీల్లో సుమారుగా 100కు పైగా కేసలు నమోదయ్యాయి. ప్రభుత్వ పరిధిలోకి రాకుండా ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం పొందేవారు అధిక సంఖ్యలోనే ఉంటారని అంచనా. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుని వ్యాధిని కట్టడి చేయడం ద్వారా ప్రజల్లో భరోసా కల్పించడం సత్వరావసరం.

మిర్చి ధరల పతనం

(మొదటి పేజీ తరువాయి)

వేస్తున్నారు. అంతేగాక అన్ని వ్యాపార కలాపాలు కూడా ఇప్పుడిపుడే ఊపందుకుంటున్నాయని అందువల్ల రానున్నపక్షం రోజుల తరువాత మార్కెట్ పుంజుకునే అవకాశం ఉందని చెబుతున్నారు.

గతనెల వరకు సగటు గరిష్ట ధర రూ.20 వేలు పలకగా ఈనెలలో గత రెండు వారాలుగా ధరలు మరింత తగ్గాయి. ప్రధానంగా 2023-24లో కనిష్ట ధర రూ.9 వేలు, గరిష్టధర రూ.26,500 పలకగా ఈ ఏడాది కనిష్టం రూ.7,500, సగటు గరిష్ట ధర రూ.16 వేలకు తగ్గింది. అంతేగాక ప్రస్తుతం ఎగుమతి ఆర్డర్లు ఇంకా ఖరారు కాలేదని వ్యాపారులు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 3.10 లక్షల క్వింటాళ్లు సరుకు వచ్చింది. గతేడాది 5.29 లక్షల క్వింటాళ్ల సరుకు వచ్చింది. ఉత్పత్తి తగ్గినా ధరలు పెరగడం లేదు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ షఫి

పోలీసు బందోబస్తు నడుమ సమావేశం

ప్రజాశక్తి - క్రోసూరు

పోలీసు బందోబస్తు మధ్య మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశానికి ఎంపిపి పేరుపమాళ్లపల్లి కోటయ్య అధ్యక్షత వహించగా ఎస్ఐ షఫీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో ఎక్కడ ఏ సమస్య ఉన్న తనకు తెలియపర్చాలన్నారు. ఎంపిడిఓ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశు ధ్య మెరుగుదల కోసం చర్యలు చేపట్టామన్నారు. వచ్చే నెల రేషన్ ద్వారా బియ్యం, పంచదార, కందిపప్పు ఇస్తామన్నారు. ఎంపిపి మాట్లాడుతూ నూతన ప్రభు త్వానికి శుభాకాంక్షలు తెలిపారు. వివాదాలేమీ లేకుండా అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. సమావేశంలో ఎంపిటి సిలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌పిఎఫ్ ఎస్సైగా ఏడుకొండలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పిడుగురాళ్ల రైల్వే పోలీస్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఏడుకొండలు శుక్రవారం భాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఆర్‌పిఎఫ్ సిబ్బంది ఆహ్వానం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లడుతూ నేరాల నియంత్రణకు కృషి చేస్తానన్నారు.

న్యూటన్స్ కళాశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం అలుగురాజుపల్లి సమీపంలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల డిప్లమా మొదటి సంవత్సరం ఈసీఈ విద్యార్థి ఎం.భాస్కర్ నాయక్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 91 శాతం మార్కులు సాధించినట్లు సెక్రటరీ జూన్నా శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకొని మంచి మార్కులు సాధించాలన్నారు. ప్రతి సంవత్సరం తమ కళాశాల నందు క్యాంపస్ డ్రైవరు నిర్వహించి వందల మంది విద్యార్థులకు కళాశాలలోనే ఉద్యోగాలు సాధించే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. భాస్కర్‌ను కళాశాల ప్రిన్సిపల్ జి.జగదీశ్వర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ బి.నరసింహారావు, డిప్లమా హెచ్‌ఒడి రామ్మోహన్‌రెడ్డి అభినందించారు.



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపల్

ఐఎంఎ నరసరావుపేట నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మానవుడితో పాటు భూమిపై పుట్టిన ప్రతి జీవరాశికి వైద్యం అవసరమేనని 3,4 దశాబ్దాల క్రితం ఒక బల్ల, స్టేతోస్కోమ్, రోగితో ప్రారంభమైన వైద్య వృత్తి అనేక కొత్త పుంతలు తొక్కుతోందని, వ్యాధి పుట్టుపూర్వోత్తరాలను తెలుసుకొని నివారించగలిగే స్థాయికి వైద్యరంగం ఎదిగిందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) రాష్ట్ర అధ్యక్షులు జయచంద్ర నాయుడు అన్నారు. శుక్రవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని ఐఎంఎ భవనంలో నరసరావుపేట నూతన కార్యవర్గ ఎన్నిక అనంతరం ఐఎంఎ సమావేశం జరిగింది. నూతనంగా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నాగోతు ప్రకాశరావు, డాక్టర్ పి.శ్రీనివాసరెడ్డిని సత్కరించారు. అనంతరం జయచంద్ర నాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ విధానాలతో 2008 నుండి వైద్య వృత్తి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోందని, ప్రతి ఏడాది రిజిస్ట్రేషన్ ప్రక్రియతో 20 రకాల అనుమతులతో ఇబ్బందికరంగా మారిందని, ప్రస్తుత విధానాలతో వైద్యుడు వైద్య సేవలు అందించే దానికంటే ముందు ప్రభుత్వం నియమ నిబంధనలతో కొంచెం ఒత్తిడికి గురికావాల్సి వస్తోందని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో చికిత్స అందించేందుకు నిబంధనలు అడ్డంకులుగా మారాయన్నారు. ఒక చిన్న క్లినిక్ లేదా హాస్పిటల్ స్థాపించాలంటే అనేక రకాల ఇబ్బందులు ఉన్నాయని, వీటన్నిటికీ సింగల్ విండో కౌంటర్ ద్వారా పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. 2028 నాటికి ఐఎంఎ శతాబ్ది ఉత్సవాలకు సిద్ధంగా ఉందని, 4 లక్షల మంది వైద్యులతో భారతదేశంలో అతిపెద్ద అసోసియేషన్ ఐఎంఎ మాత్రమేనని తెలిపారు.

డాక్టర్ నాగోతు ప్రకాష్‌రావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజ స్థాపన ఐఎంఎ లక్ష్యమన్నారు. ఇటీవల కొన్ని అత్యవసర కేసులలో రోగికి ప్రాణాపాయం వాటిల్లితే వైద్యుని తప్పుగా రోగి బంధువులు ప్రభుత్వం చిత్రీకరిస్తోందని, ఒక వైద్యుడు సంపూర్ణ వైద్యునిగా తయారు కావాలంటే దాని వెనుక 20, 25 ఏళ్ల కృషి ఉంటుందని, ఏ వైద్యుడూ రోగి ప్రాణాలు పోగొట్టాలని చూడడని అన్నారు. ఇలాంటి ఘటనల వల్ల అత్యవసర కేసులకు చికిత్స అందించేందుకు వైద్యులు ముందుకు రాని పరిస్థితి నెలకొంటుందని చెప్పారు. ప్రతి ఏడాది రిజిస్ట్రేషన్ సంబంధించి ప్రక్రియలకు సింగిల్ విండో కౌంటర్ ద్వారా ఐదేళ్లకు ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాలను ప్రవేశపెట్టాలని అన్నారు. వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి తమ అసోసియేషన్ ఇప్పటికే కేంద్ర రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రులు కలిసి విన్నవించినట్లు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గంచే రాష్ట్ర అధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్ష కార్యదర్శులతోపాటు వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ యలవర్తి వరబాబు, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి, స్టేట్ రిప్రజెంటేటివ్‌గా డాక్టర్ సునీత, సెంట్రల్ రిప్రజెంటేటివ్‌గా డాక్టర్ ఎస్.రాంప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర కార్యదర్శి పి.ఫణిధర్, పట్టణ వైద్యులు రామలింగారెడ్డి, కడియాల వెంకటేశ్వరరావు, గజ్జల బ్రహ్మారెడ్డి, సుధీర్ భార్గవరెడ్డి, గార్లపాటి కృష్ణకాంత్, మాధవి, కంకణంపాటి భారతి, సత్యకృష్ణ దీపిక, విజేత, డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి అభినందించారు.



బీమా ప్రీమియంపై జిఎస్‌టి ఉపసంహరించాలి

ఎంపి శ్రీకృష్ణదేవరాయులకు ఎల్‌ఐసి నాయకుల వినతి

ప్రజాశక్తి-గుంటూరు

బీమా ప్రీమియంపై విధిస్తున్న 18 శాతం జిఎస్‌టిని ఉపసంహరించాలని, పాలసీదారులు చెల్లించే బీమా ప్రీమియంకు సెక్షన్ 80సి క్రింద ప్రత్యేక ఇన్కం టాక్స్ రాయితీలు కల్పించాలని, ఆరోగ్య బీమాపై సెక్షన్ 80డి క్రింద రద్దు చేసిన రాయితీలను నూతన ఐ.టి విధానం క్రింద పునరుద్ధరించాలని ఎల్‌ఐసి ఉద్యోగులు నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకష్ణ దేవరాయలును కోరారు. ఈమేరకు శుక్రవారం ఎంపీని గుంటూరులో స్థానిక బీమా ఉద్యోగులు కలిసి వినతిపత్రం అందచేశారు. ప్రభుత్వ రంగంలోని నాలుగు సాధారణ బీమా సంస్థలను విలీనం చేయడం దేశ ఆర్థిక ప్రయోజనాలకు ఉపయోగకరమని పేర్కొన్నారు. బీమా రంగానికి సంబంధించిన ముఖ్యమైన సమస్యలను కేంద్ర ఆర్థికమంత్రి దష్టికి తీసుకువెళతానని శ్రీకష్ణ దేవరాయలు హామీ ఇచ్చారు.ఎంపీని కలిసిన వారిలో ఎల్‌ఐసి ఉద్యోగుల యూనియన్ మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వి.వి.కే. సురేష్, కె.జి. రమేష్, ఆర్.వి.ఎస్. శ్రీనివాస్, డి. సైదులు, ఐ. వెంకట్రావు, ఎస్. ప్రసాద్, పి.ఆర్. రాజశేఖర్, ఎమ్.రాజేశ్వరరావు తదితరులుఉన్నారు.



ఎంపి శ్రీకృష్ణదేవరాయలుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని స్కిల్‌డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులందరూ డీఆర్డీఏ, మెప్మా అధికారులను సమన్వయం చేసుకొని 2024-25 సంవత్సరానికి నిరుద్యోగ యువతకు శిక్షణ, ఉపాధి కల్పనపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులైన వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ మాట్లాడుతూ జిల్లాలో 9 స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, నిర్మాణ రంగం, ఆటో మొబైల్ , వ్యవసాయం , బ్యూటిఫియన్ , హెూటల్ మేనేజ్‌మెంట్ , ఐటి రంగాల్లో యువతకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్మెంట్ , సీడాప్ కలసి 2023-24 సంవత్సరంలో 15 కంపెనీలతో నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళా నిర్వహించారని, ఇందులో 4236 మంది యువత రిజిస్టర్ చేసుకోగా, 2075 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందారన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా ఫిరంగిపురంలో రూ.40 లక్షలతో మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ మహిళా మార్ట్ విజయ వంతంగా నిర్వహిస్తున్నారన్నారు. చేబ్రోలులో తేనె పరిశ్రమ , ఫిరంగిపురం, మేడికొండూరులో చిల్లీ , దుగ్గిరాలలో పసుపు యూనిట్లు నెలకొల్పడం జరిగిందన్నారు. ఎల్‌డియం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన ఎస్సీ , ఎస్టీ, ఓబిసి, మైనారిటీ , ట్రాన్స్ జెండర్స్‌కు సబ్సిడీతో ముద్రా ఋణాలు అందజేయడం జరుగుతుం దన్నారు. నిత్యావసర సర్వీస్ సెక్టార్ లో రూ.20 లక్షల వరకు ఋణం తీసుకోవచ్చని , మూడు సంవత్సరాల వరకు రెగ్యులర్‌గా కట్టిన వారికి తిరిగి లోన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ కిరణ్మయి మాట్లాడుతూ యువతలో బయాన్ని పోగొట్టేందుకు ఎన్జిఓల ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నామని , 30 మందికి బ్యూటిఫియన్ కోర్సు అందివ్వడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో యువతకు ఉపాధి శిక్షణ అవకాశాలు కల్పించాలని, బిల్డర్స్ అసోషియేషన్‌తో మాట్లాడి యువతకు అవసరమైన రంగాల్లో శిక్షణ అందించేలా చూడాలన్నారు. యువతలో నైపుణ్యాభివద్ధి పెంపొందించి వారు స్వయం ఉపాధి రంగాలలో మెరుగైన అవకాశాలు పొందేలా మంచి జీవనం కోసం వారు ఆదాయాన్ని పెంచుకోవడానికి శిక్షణ అందించా లన్నారు. సమావేశంలో డిఎస్ డిఓ ప్రణయ్ , డిప్యూటీ డైరెక్టర్ ఇండస్ట్రీస్ యం.సుధాకర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

ఆస్తి పన్ను సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో ఆస్తి పన్ను ఏటా 15 శాతం పెరుగుదలను తక్షణమే నిలిపివేయాలని, ఆస్తి పన్ను సవరణ చట్టం 44/2020 రద్దు చేయాలని ఆస్తి పన్ను చెల్లింపుదారులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో నిర్వహించిన ఆస్తి పన్ను చెల్లింపు దారుల సమావేశానికి న్యాయవాది అవధానుల హరి అధ్యక్షత వహించారు. ఈ సమావేశ ంలో సిటీ హౌస్ ఓనర్స్ అసోసి యేషన్ కార్యదర్శి పి.ఎస్.మూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం అద్దె విలువపై ఆస్తి పన్ను లెక్కించే విధానాన్ని ప్రవేశపెట్టిందని, దీని కోసం మున్సిపల్ చట్టాలకు సవరణ చేస్తూ సవరణ చట్టం 44/2020 తెచ్చిందన్నారు. దీంతో ఇళ్ళ స్థలాల మార్కెట్ విలువ మారినప్పుడల్లా ఆస్తి పన్ను కూడా మారే విధంగా చట్టంలో నిబంధన విధించార న్నారు. అన్ని సంఘాలు, ప్రజలు దీన్ని వ్యరేకించినా ప్రభుత్వం పట్టించుకోకుండా ఉత్తర్వులు తెచ్చిందని, దీని ప్రకారం ఆస్తి పన్ను ఏటా 15 శాతం పెంచుత న్నారన్నారు. అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం జిఒ ప్రకారం నాలుగేళ్లలో 75 శాతం ఇంటి పెరిగిందన్నారు. చివరికి ఆస్తిని తండ్రి కొడుకు పేరును గిఫ్ట్ రాసినా, గిఫ్ట్‌గా రాసిన తేదీన ఉన్న కేపిటల్ విలువ ప్రకారం ఇంటి పన్ను విధిస్తున్నారన్నారు. రికార్డు లలో పేరు మారినందుకు పన్ను పెరుగుతుందని, అసంబద్ధమైన ఈ విధానానికి నూతన ప్రభుత్వం ముగింపు పలకాలని కోరారు. ఆస్తి పన్ను సవరణ చట్టం రద్దు చేసి, అద్దె విలువ ఆధారంగా ఇంటి పన్ను విధించాలని కోరారు. సమావేశంలో కేశవరావు, పి.కొండయ్య పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న యజమానులు



జగ్గయ్య పేట సిమెంట్ ఫ్యాక్టరీ ఘటనలో

మరో కార్మికుడు మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి

జగ్గయ్యపేటలోని అల్ట్రాటెక్ సిమెంటు ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాద సంఘటనలో మరో కార్మికుడు మృతిచెందాడు. ప్రమాదంలో గాయపడి మణిపాల్‌లో చికిత్స పొందుతున్న పరిటాల అర్జునరావు (38) శుక్రవారం మృతిచెందాడు. దీంతో మృతుల సంఖ్య ఇప్పటివరకు మూడుకు చేరుకుంది. పోస్టుమార్టం నిమి త్తం మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యుత్‌షాక్‌తో కార్మికుడు మృతి

ప్రజాశక్తి - నాదెండ్ల

అల్యూమినియం అద్దాలు ఫిట్ చేసే కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని సాతులూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్సై బలరాం రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అప్పాపురం గ్రామానికి చెందిన సిహెచ్ శ్రీ హర్ష (22) అల్యూమినియం వర్కు చేస్తూ ఉండేవాడు. రోజు మాదిరిగానే శుక్రవారం కూడా సాతులూరు ఈతరం ఎదురుగా ఉన్న కొత్త బిల్డింగ్ లో రెండో అంతస్తుపై పై వర్క్ చేస్తూ ఉండగా పక్కనున్న విద్యుత్ వైర్‌కు అల్యూమినియం పైపు తగిలింది. దీంతో పనిలో ఉన్న శ్రీహర్ష ఒక్కసారిగా విద్యుత్ షాక్ గురి అక్కడికక్కడే మృతి చెందాడు. నాదెండ్ల ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇనుప గేటు పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-గుంటూరు

ఇనుప గేటు మీద పడటంతో ఐదో తరగతి విద్యార్థినికి తీవ్రగాయాలు అయిన ఘటన పెదకాకాని మండలం, యాదవపాలెంలో చోటు చేసుకుంది. సదరు బాలికకు గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. 48 గంటలు గడిస్తే గానీ ఏవిషయం చెప్పలేమని వైద్యులు తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఇంటర్‌వెల్ సమయంలో ఐదో తరగతి బాలిక తినుబండారాలు కొనుక్కోవటానికి బయటకు వెళతానని హెచ్‌ఎంను అనుమతి అడిగింది. కానీ హెచ్‌ఎం అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆ బాలిక మరొక బాలిక అయిన షేక్.మౌషినాను వెంటబెట్టుకొని ప్రహరీ గోడ దూకి బయటకు వెళ్లారు. ఆ బాలిక తినుబండారాలు కొనుక్కుంటుండగా, వెంట వెళ్లిన మౌషినా కొట్టు పక్కనే నిర్మాణంలో ఉన్న భవనం వద్ద గోడకు ఆనించి ఉంచిన ఇనుక గేటును పట్టుకోవటంతో అది కదిలి బాలికపై పడింది. దీంతో మౌషినా తలకు, కాలికి తీవ్ర గాయం అయ్యింది. తలపైభాగం బాగా దెబ్బతిన్నది. చెవిలో నుండి రక్తం కారుతుంది. విషయం తెలుసుకున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు బాలికను గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించటంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. మౌషినా వారి తల్లిదండ్రులకు ఒక్కతే కూతురు. తండ్రి ఆటో డ్రైవర్ కాగా, తల్లి కూలిపనులకు వెళుతుంది. ఈ ఘటన జిల్లా కలెక్టర్‌కు తెలియటంతో పాఠశాలలోని ఐదుగురు ఉపాధ్యాయుల్ని సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

ఆన్‌లైన్ లింకులతో మోసపోయిన యువతి

ప్రజాశక్తి - తెనాలి

ఆన్లైన్ యాప్ క్లిక్ చేయడం ద్వారా యువతి నగదును కోల్పోయిన ఘటనపై రూరల్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన టి రేణుకకు టెలిగ్రామ్ యాప్ లో ఓ లింక్ వచ్చింది. సినిమాలపై రేటింగ్స్ ఇస్తే డబ్బులు వస్తాయన్నది ఆ లింకు సారాంశం. ఫలితంగా ఆమె ఆ లింకు క్లిక్ చేయడంతో రూ. 30 వేలు సంపాదించింది. అత్యాశకు పోయి ఆ లింకులో ఉన్న మూడు కండిషన్స్‌ను ఫాలో అయింది. ఆమె అకౌంట్ నుంచి రూ. 2.53 లక్షలు మాయమయ్యాయి. దీంతో మోసపోయినట్లు గమనించి పోలీసులు ఆశ్రయించడంతో వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లాట్ విక్రయంలో మోసంపై కేసు

ప్రజాశక్తి - తెనాలి : ఫ్లాట్ విక్రయిస్తానని నమ్మబలికి అగ్రిమెంట్ రాసి అడ్వాన్స్ తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం అంగలకుదురు గ్రామానికి చెందిన మాధవరావు ఫ్లాట్ విక్రయిస్తానని చెప్పి అదే ప్రాంతానికి చెందిన సుమలతకు అగ్రిమెంట్ చేశాడు. కొంత నగదును అడ్వాన్సా తీసుకున్నాడు. గడువు ముగిసినా ఫ్లాట్ రిజిస్టర్ చేయకపోవడంతో బాధితురాలు పోలీసులు ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

బడిబటయ పిల్లల్ని గుర్తించాలి

ప్రజాశక్తి - వినుకొండ

మండల కేంద్రమైన శావల్యాపురం జెడ్‌పి పాఠశాల, పొట్లూరులోని జెడ్‌పి పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, వినుకొండలోని కస్తూర్బా గాంధి బాలిక విద్యాలయాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ సభ్యులు బత్తుల పద్మావతి శుక్రవారం తనిఖీ చేశారు. పొట్లూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పిల్లలకు ఆమే వడ్డించారు. బడి మానేసిన వారిని బడిలే చేర్చాలని, బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. అంగన్వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు బాలల హక్కులను వివరించారు. ఏమైనా సమస్యలుంటే 1098, 100 టోల్ ఫ్రీ నంబర్లకు సంప్రదించాలని సూచించారు. ఈ నంబర్లను పాఠశాలల గోడలపైనా రాయాలని ఆదేశించారు. విద్యార్థులు ఏమైనా సమస్యలు చెబితే వాటిని వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సాధికారిత అధికారి కె.ఉమారాణి, ప్రాజెక్ట్ అధికారి ఎం.అనురాధ పాల్గొన్నారు.

దోమల నివారణతోనే రోగాలు దూరం

జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : దోమల నివారణతోనే రోగాలు దూరం చేయవచ్చని జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ అన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించామని, ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఎక్కడైనా మురికి నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ బాల్స్ వేయిస్తున్నామని తెలిపారు. ఇంటి పరిసరాలలో అదేవిధంగా పశువుల పాకల వద్ద ఎక్కువ రోజులు నీరు నిలవకుండా, పాత బడిన వస్తువులు కుండలు ఇతర చెత్తా చెదారం లేకుండా ప్రజలు చూసుకోవాలని సూచించారు. రక్షిత నీటి సరఫరా ట్యాంకులను శుభ్రం చేయించాలని, పైపులు లీకేజీలుంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య పనులు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజలు బయట ఆహారం తీసుకోవద్దని, వర్షాకాలంలో తాజా కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, డెంగీ, మలేరియా, విష జ్వరాలు ప్రబలకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని చెప్పారు.


సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - మాచర్ల : గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రజా ప్రతినిధులు, అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, డయేరియా, విషజ్వరాలు ప్రబలకుండా చూసుకోవాలని వైద్యాధికారులు సూచించారు. ఎంపిపి బి.మంగమ్మ అధ్యక్షతన శుక్రవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. డయేరియా, విష జ్వరాలపై ప్రధానంగా చర్చించారు. డాక్టరు శివలీల మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీరు తాగాలని, దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమతెరను వాడాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. జడ్‌పిటిసి మల్లుస్వామి, పి.సుజాతకోటిరెడ్డి, ఎంపిడిఒ సరోజినిదేవి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మార్కుల్లో మేటి.. ఐఐఐటి సీట్లు కొట్టి..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ











సీట్లు సాధించిన విద్యార్థులు.. సి.వెంకట అవినాష్, డి.దీపిక, ఎం.భవ్యశ్రీ, షేక్ ఆయాష పర్వీన్, బాణావత్ అనీల్ నాయక్.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలంలో గతేడాది పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ఎంఇఒ డి.బ్రహ్మేశ్వరరావు శుక్రవారం తెలిపారు. వి.రెడ్డిపాలెం ఎపి మోడల్ స్కూల్ నుండి పదో తరగతిలో 580కి పైగా మార్కులు సాధించిన డి.దీపిక, ఎం.భవ్యశ్రీ, సి.వెంకట అవినాష్ నూజివీడు క్యాంపస్‌కు, వి.రెడ్డిపాలెం జెడ్‌పి పాఠశాలకు చెందిన షేక్ ఆయాష పర్వీన్ శ్రీకాకుళం క్యాంపస్, బాణావత్ అనీల్ నాయక్ ఒంగోలు ట్రిపుల్ ఐటి క్యాంపస్‌కు ఎంపికైనట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు ఇతర ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



ప్రజాశక్తి - పెదకూరపాడు

స్థానిక విజయ విద్యా విహార్ హైస్కూల్ విద్యార్థి షేక్ నూరే అస్మతుల్లా ట్రిపుల్ ఐటి సీట్ సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం నోముల కోటేశ్వరరావు తెలిపారు. అస్మతుల్లాకు ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ చదువు ఉచితంగా అందుతుందన్నారు. సీట్ సాధించిన విద్యార్థిని పాఠశాల సెక్రటరీ కొమ్మాలపాటి శ్రీకాంత్ అభినందించారు. అభినందించిన వారిలో కొమ్మాలపాటి రాధా, ఉపాధ్యాయులు వాసు, పవన్, నాగరాజు, జాన్‌సైదా, రామాంజనేయులు ఉన్నారు.



మండల పరిధి 75 త్యాళ్లూరు జెడ్‌పి పాఠశాల విద్యార్థిని కె.తనూజ శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సీటు సాధించినట్లు హెచ్‌ఎం డాక్టర్ ఎ.శ్రీనివాసరెడ్డి తెలిపారు. పదవ తరగతిలో తనూజ 563 మార్కులు సాధించి మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు గుర్తు చేశారు. తనూజాను హెచ్‌ఎంతోపాటు పీసి చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మండల పరిధిలో వేలూరు జెడ్‌పి పాఠశాలకు చెందిన విద్యార్థిని తన్నీరు జనని ఒంగోలు ట్రిపుల్ ఐటి సాధించిన నేపథ్యంలో పాఠశాలలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. హెచ్‌ఎం ఎం.కిషోర్ మాట్లాడుతూ జనని భవిష్యత్‌తో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బొంతా చైతన్య మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు జననిని ఆదర్శంగా తీసుకొని బాగా కష్టపడి చదవాలన్నారు.





ప్రజాశక్తి - క్రోసూరు

మండల కేంద్రమైన క్రోసూరులోని మోడల్ స్కూల్ ఇద్దరు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పదో తరగతిలో 570 మార్కులు సాధించిన మౌల జాస్మిన్, 570 మార్కులు సాధించిన చంద్రిక ట్రిపుల్ ఐటికి అర్హత పొందారు. ఈ సందర్భంగా పాఠశాలలో అభినందన సభ నిర్వహించగా సీట్లు సాధించిన విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రోత్సాహం, అంకితభావంతో కూడిన విద్యా బోధనతో తాము ఈ సీట్లు సాధించగలిగామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఏకుల ప్రసాదరావు, గణేష్, ప్రిన్సిపాల్ మేరీ సుజన, ఉపాధ్యాయులు లూర్ధు మేరీ, శౌరిరాజు, గోపాల కృష్ణయ్య, శ్రీలత, షీబారాణి, రఘుబాబు, కళ్యాణ్ కుమార్, శివనాగేశ్వరావు, బ్యూలా, నాగమల్లేశ్వరి, రమేష్‌బాబు, అనిల్‌కుమార్, పావని పాల్గొన్నారు.

డయేరియా ప్రాంతాల్లో రాష్ట్ర బృందం పరిశీలన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల



పట్టణంలోని లెనిన్ నగర్, మారుతి నగర్‌లో రాష్ట్ర ఎపిడమిక్ అధికారులు బృందం, జిల్లా వైద్యధికారి బి.రవిబాబు శుక్రవారం పర్యటించారు. ప్రజలకు డయేరియా పట్ల అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డి వినియోగించుకోవాలని, చేతుల పరిశుభ్రత పాటించాలని చెప్పారు. ఎవరికైనా నీళ్ళ విరేచనాలు, వాంతులు ఉంటే వెంటనే ప్రాథమిక వైద్య కేంద్రంలో సంప్రదించాలన్నారు. పరిశీలనలో అధికారులు రవితేజ, నస్రీమ, పద్మావతి, సిహెచ్ఓ హర్షవర్ధన్, ఎంపిహెచ్ఈవో సుబ్రమణ్యం, పట్టాభి, రసూల్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ పర్యటన

పట్టణంలో నేడు మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పర్యటించనున్నట్లు టిడిపి నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. లెనిన్ నగర్, మారుతి నగర్‌ల నందు విజృభిం స్తున్న డయేరియాపై అధికారులతో చర్చించి, డయేరియా కట్టడి చర్యల కోసం వారు రానున్నట్లు పేర్కొన్నారు.

గుండ్లకమ్మ నుండి తాగునీరిస్తాం

- పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- ఎండిపోతున్న వినుకొండలోని సింగర చెరువుకు పరిశీలన
- ప్రస్తుత నీరు 15 రోజులకే సరిపోతాయని ప్రకటన


ప్రజాశక్తి - వినుకొండ



సింగర చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

గుండ్లకమ్మ నది నుండి వినుకొండ పట్టణానికి తాగునీరు సరఫరా చేయాలని అధికారులు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. వినుకొండకు శుక్రవారం వచ్చిన ఆయన పట్టణానికి తాగునీరు అందించే సింగర చెరువు అడుగంటడంతో సందర్శించారు. చెరువులో నీరు మరో 15 రోజులు మాత్రమే వస్తాయని, గుండ్లకమ్మ నది నుండి నీటిని నింపి ప్రజలకు యథావిధిగా సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ నాగార్జునసాగర్ డ్యాంలో నీరు డెడ్ స్టోరేజ్‌లో ఉండటం వలన నీటి విడుదల ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. ఎగువ కురిసిన వర్షాలకు ఆల్మట్టి డ్యాం నుండి శ్రీశైలం డ్యామ్, నాగార్జున సాగర్ డ్యామ్‌లకు నీటి విడుదల కొంత ఆలస్యమయ్యేటట్లు ఉందని, చీకటిగలపాలెం అండర్ రోడ్డు వద్ద గుండ్లకమ్మ నది నుండి తాగునీటినీ వినుకొండ పట్టణానికి సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. గుండ్లకమ్మ నది నుండి ట్యాంకర్ల ద్వారా నీటిని పట్టణంలోని సింగర చెరువు ఫిల్టర్ బెడ్ల వద్ద డంపింగ్ చేసి నీటిని శుద్ధిపరచి ప్రజలకు సరఫరా చేస్తామన్నారు. వినుకొండ పట్టణంతో పాటు పల్నాడు జిల్లాలో తాగునీటి సమస్యను సిఎం చంద్రబాబు, మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లామని, కృష్ణా రివర్ బోర్డుతో చర్చించి త్వరలో నాగార్జునసాగర్ కుడి కాల్వకు తాగునీరు విడుదలకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, 32వ వార్డు కౌన్సిలర్ వి.లింగమూర్తి, కమిషనర్ టి.కృష్ణవేణి, డిఈ వెంకయ్య, టిడిపి నాయకులు పీవీ.సురేష్‌బాబు, షమీంఖాన్, పి.కృష్ణ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి పలువురు విద్యార్థులు ఎంపిక


ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిన మంగళగిరి విద్యార్థులు

ప్రజాశక్తి - మంగళగిరి
మంగళగిరి పట్ట ణంలోని బిఎన్ఆర్ మున్సిపల్ హైస్కూల్లో పదవ తరగతి చదివిన నలుగురు విద్యార్థులు ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లుగా పాఠశాల ప్రధానో పాధ్యా యులు యు ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. సయ్యద్ మహమ్మద్ 582 మార్కులతో, నందం కావ్య శ్రీ 577 మార్కులతో నూజివీడు ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లుగా ఆయన తెలిపారు. ఇమ్మంది హేమంత్ కుమార్ శ్రీకాకుళం ట్రిబుల్ ఐటీకి 573 మార్కులతో, బిట్రా దీక్షిత 573 మార్కులతో ఒంగోలు ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లుగా తెలిపారు. 2024 మార్చిలో జరిగిన పదవ తరగతి ఫలితాల్లో ఈ పాఠశాల నుండి 91శాతం ఉత్తీర్ణత సాధించి నట్లుగా ఆయన తెలిపారు.

ప్రజాశక్తి - చేబ్రోలు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల లో చదివిన విద్యార్థులు బి చిత్రలేఖ, జడ్పీహెచ్ఎస్ నారాకోడూరు ,కె. ఈశ్వరి, జడ్పీహెచ్ఎస్ శేకూరు ఎం విశాలాక్షి, ఎస్ కె ఫాతిమున్నీసా, టి దీవానా కుమార్ ఐఐఐటి నూజివీడు,మరియు ఒంగోలులో సీటు పొందా రని మండల విద్యాశాఖ అధికారి ఆర్ సుబ్బారావు తెలిపారు.2024 పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల టాపరులు గా ని లిచిన వీరు ట్రిపుల్ఐటిలో సీట్లు సంపాదించడంతో ఎంతో సంతోషంగా ఉందన్న మండల విద్యాశాఖ అధికారులు ఆర్ సుబ్బారావు మరియు ఏవీహెచ్ ప్రసాద్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు పాఠశాల ఉపాధ్యాయుల విద్యార్థులను అభినందించారు.

అన్నా, చెల్లెళ్లకు ట్రిపుల్ ఐటిలో సీట్లు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్


స్థానిక జడ్పీ పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు రాసి అత్యధిక మార్కులు సాధించిన వరగాని గ్రామానికి చెందిన అన్నా చెల్లెలు బాణావత్ చరణ్ సింహ నాయక్, బాణా వత్ పూజిత భాయ్ ట్రిపుల్ ఐటి లో సీటుసీట్లు సాధిం చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని లక్ష్మీ దుర్గ శుక్రవారం తెలిపారు. అన్నకు నూజివీడు ట్రిబుల్ ఐటీ లోనూ చెల్లెలకు ఒంగోలు ట్రిబుల్ ఐటీ లోనూ సీట్లు సాధించిన సందర్భంగా గ్రామస్తులతోపాటు పాఠశాల అభివద్ధి కమిటీ సభ్యులు తేళ్ల శివ నాగేశ్వరరావు గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో చైర్మన్

సిఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు
సిఎంఎ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు ఆలిండియా టాప్ మార్కులతోపాటు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ తెలిపారు. ఎస్. సంతోష్కుమార్ 400 మార్కులకుగాను 338, ఎస్.కె.ఫిర్దోస్ 316, బి.నరసింహ సాయిధీరజ్ 312, బి.వెంకటశివసాయి కార్తీక్ 310, ఎస్.భువన్ వెంకటసాయి 304, కె.తిరుమల సాయి సంతోష్ 304, వి.శరణ్యలక్ష్మి 302, బి.రాహుల్ 302, ఎన్.భవ్యసాయి 300, ఎస్.కిషోర్ 300, ఎస్.కె.సలాం 300 వంటి ఉత్తమ మార్కులు సాధించారన్నారు. ఇంటర్ నుండి సిఏ, సిఎంఎ ఫౌండేషన్ కోర్సులకు కోయిన్ బ్యాచ్ ప్రోగ్రామ్ ద్వారా అనుభజ్ఞులైన అధ్యాపకులతో కోచింగ్ అందించటం ద్వారా తమ విద్యార్థులు ఆలిండియా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను అన్నా నందకిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి అభినందించారు.



రైతు బజారులో సౌకర్యాలు పెంచండి

కృష్ణనగర్ రైతు బజార్ పరిశీలనలో ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి
స్థానిక కృష్ణ నగర్ రైతు బజారును ఎమ్మెల్యే గళ్ళా మాధవి శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా రైతులకు మెరుగయిన సౌకర్యాలు కల్పించాలని,అదే మాదిరిగా పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. దళారులు ఎవ్వరు రాకుండా రైతులే నేరుగా ప్రజలకు కూరగాయలను విక్రయించాలని సూచించారు. డివిజన్ అధ్యక్షుడు మానం శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.

సిఏ ఫలితాల్లో మాస్టర్మైండ్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు
ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సి.ఎ ఇంటర్, సి.ఎ ఫైనల్ ఫలితాల్లో మాస్టర్మైండ్స్ విద్యార్థులు ఆలిండియా 14వ ర్యాంకు, ఆలిండియా 37వ ర్యాంకు, ఆలిండియా 38వ ర్యాంకు సాధించారని సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలియజేశారు.ఈ ర్యాంకులతోపాటు, సిఎ ఇంటర్, సిఎ ఫైనల్లో గ్రూప్-1గానీ, గ్రూప్-2 గానీ, రెండు గ్రూపులు పాసైన విద్యార్థులు రెండువేల మంది ఉంటారని తెలిపారు. సి.ఎ. ఫైనల్ ఫలితాల్లో కె.తేజస్విని ఆలిండిచా 14వ ర్యాంకు, వై.వర్షిత రెడ్డి 37వ ర్యాంకు, సిఎ ఎంటర్లో ఎంవిఎల్ నారాయణ 38వ ర్యాంకు సాధించారన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను అభినందించారు.


కొత్తపేట తేజశ్విని (14వ ర్యాంక్)


వర్షితారెడ్డి (37వ ర్యాంక్)


ఎంవిఎస్ నారాయణ (38వ ర్యాంక్)

దేశాభివృద్ధిలో వర్తకం ప్రధాన భూమిక

ఆర్వీఆర్ సదస్సులో ఎం.సాంబశివరావు

ప్రజాశక్తి-గుంటూరు
దేశ ఆర్థిక పురోగతి సాధనలో ఆలోచనాత్మక కమోడిటీస్ ట్రేడింగ్ ప్రధాన భూమిక పోషిస్తుందని మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సీనియర్ మేనేజర్ అండ్ స్టేట్ హెడ్ యం.సాంబ శివరావు పేర్కొన్నారు. ఆర్వీఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో శుక్రవారం సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా సహకారంతో కళాశాల ఈడి సెల్, ఆర్జె ఈనెస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కమోడిటీ డెరివేటివ్స్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక పరిస్థితిపై కమోడిటీస్ ట్రేడింగ్ ప్రభావాన్ని విద్యార్థులకు వివరించారు. వస్తువుల వర్తక వ్యాపారంలో జరిగే ధరల హెచ్చుతగ్గులు ప్రపంచలోని వివిధ దేశాలలో సంభవించే యుద్ధ వాతావరణం, ఎలక్షన్స్, వాతావరణ అనుకూలత, ప్రతికూలత వంటి వివిధ అంశాలపై ఆధారపడి ఉంటాయన్నారు. దానికి అనుగుణంగా పూర్తి పరిజ్ఞానంతో వస్తువుల ట్రేడింగ్లో అవగాహన పొందాలని ఆయన సూచించారు. దేశాన్ని సుసంపన్నమైన దేశంగా నిర్మించే దిశగా విద్యార్థులు వర్తక వ్యాపార విజయంలో సులభతర ఆలోచనలు చేయాలని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


సాంబశివరావుకు మెమోంటో అందచేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

జెకెసిలో గుండె సమస్యలపై అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి-గుంటూరు


డాక్టర్ను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

స్థానిక జెకెసి కాలేజిలో 'గుండె సమస్యలు-నివారణ మార్గాలు' అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్ర మం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో రమేష్ హాస్పిటల్స్ హృద్రోగ నిపు ణులు డాక్టర్ నాగశ్రీ హరిత, డాక్టర్ షుకూర్ చిలకపాటి పాల్గొని గుండెకు సంబంధించిన అన్ని అంశాలను, వాటి నివారణ పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. వివిధ రకాల చిత్రాలు, బొమ్మల ప్రదర్శనలతో గుండె తీరును విశ్లేషించి, నివా రణ మార్గాల గురించి అవగాహన కల్పించి, ముందే మేల్కొ నాలని సూచించారు. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే ఏమి చెయ్యాలి, ఏమి చెయ్యకూడదు, సమతుల ఆహారం ఎలా తీసుకోవాలి, ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్త లను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వ రరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.గోపిచంద్, కళాశాల స్నాతకోత్సవ స్థాయి సంచాలకులు యస్.ఆర్.కె.ప్రసాద్ పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చట్టం చేయాలి

రూ.20వేలు రైతు భరోసా హామీని ప్రభుత్వం తక్షణం అమలు చేయాలి : ఏపి రైతు సంఘం

ప్రజాశక్తి - కొల్లిపర
ఎన్నికల హామీలో భాగంగా రైతు భరోసా రూ.20 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని వల్లభాపురం గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సాగు పెట్టుబడి కోసం రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుకు అసెంబ్లీలో చట్టం తేవాలని కోరారు. కౌలు రైతుల సాయానికి అడ్డంకిగా మారిన భూ యజమాని సంతకం అనే నిబంధనను తొలగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పంట కాలువల్లో తూటాకు, గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలన్నారు. కార్యక్రమంలో లంకిరెడ్డి సాంబిరెడ్డి, జి శివరామిరెడ్డి, అవుతునాగిరెడ్డి, వంగ మల్లారెడ్డి, విజయరాణి దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు


రైతుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు మూలక శివ సాంబిరెడ్డి


పాఠశాలకు కుర్చీలు, టేబుల్ అందజేస్తున్న వేణుగోపాలరెడ్డి తదితరులు

పేద విద్యార్థులకు అండగా ఉంటాం

భవిత కేంద్రంలో కుర్చీలు అంజేసిన జనసేన నాయకులు వేణుగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - కొల్లిపర : పేద విద్యార్థులకు జనసేన పార్టీ అండగా ఉంటుందని కొల్లి పర జనసేన పార్టీ నాయకులు భీమవరపు వేణుగోపాల్ రెడ్డి అ న్నారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో వేణుగోపాల్ రెడ్డి వి ద్యార్థుల కొరకు 16 కుర్చీలు రెండు టేబుల్ స్, ఫిజియోథెరపీ కిట్టును అందజేశారు. ఈ సందర్భంగా భీమవరపు వేణుగోపాల్ రెడ్డిని ఎంఇఒ 1, 2 సాల్మన్ రాజు, 2ఝాన్సీ లక్ష్మి అభినం దించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు భీమవరపు కిషో ర్రెడ్డి, ఉపాధ్యాయులు మత్యుంజయరావు, సురేష్ బాబు పాప య్య, ఫిజియోథెరపీ ఎం శివ నాగమల్లేశ్వరరావు, సిఆర్పీ రమేష్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాధవికి బిసి సంక్షేమ సంఘం సన్మానం

ప్రజాశక్తి - మంగళగిరి
గుంటూరు పశ్చిమ శాసన సభ్యురాలిగా ఎన్నికై, తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావుతో పాటు, సంఘ నాయకులు, కార్యకర్తలు బొకేల నిచ్చి, శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీ కేసన మాట్లాడుతూ, బలహీన వర్గాలకు చెందిన మహిళకు ఎంఎల్ఏ టిక్కెట్టు నిచ్చిన టిడిపి అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపు తున్నా మన్నారు. ఎంఎల్ఏ గల్లా మాధవి బీసీల సంక్షేమం-అభి వృద్ధి కోసం, వివిధ పథకాల రూపకల్పనలోనూ, విధాన నిర్ణ యంలోను ప్రభుత్వానికి తోడ్పాటు నందించాలని కోరారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో తన గెలుపు కోసం కృషి చేసిన సంఘ నాయకులు, ప్రజలందరికీ ధన్యవాదాలు తెలియ జేశారు. భవిష్యత్తులో 139 బీసీ కులాల మధ్య మరింత ఐక్యతను పెంచి, రాజకీయంగా కూడా ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం కార్యకర్తల ఎదుగుదలకు, బీసీల సంక్షేమం - అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్ర మంలో జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నిమ్మల శేషయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ తన్నీరు ఆంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర సమన్వ యకర్త గోనుగుంట బ్రహ్మానంద శర్మ, ప్రకాశం జిల్లా అధ్యక్షులు బలగాని ఆంజ నేయులు, గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, రాష్ట్ర కార్యదర్శి శివరాం బాబాజీ తదితరులు పాల్గొన్నారు.



ఎంఎల్ఏ మాధవిని సన్మానిస్తున్న బిసి సంక్షేమ సంఘం నాయకులు

నెలరోజుల పాలన అద్భుతం : శ్రీధర్



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నెలరోజుల కూటమి పాలన అద్భుతమని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. హామీ మేరకు ఏప్రిల్ నుండి ఎన్టీఆర్ భరోసా పింఛను రూ.3 వేలు నుండి రూ.4 వేలకు, వికలాంగులకు రూ.6 వేలకు పెంచినట్లు తెలిపారు. ఉచిత ఇసుక విధానాన్ని తెచ్చి భవన నిర్మాణ రంగంపై ఆధారపడిన అనేక రంగాల కార్మికుల కుటుంబాల్లో సంతోషాన్ని కూటమి ప్రభుత్వం నింపిందని పేర్కొన్నారు. రాష్ట్ర విడిచి వెళ్లిన పారిశ్రామిక వేత్తలను తిరిగి రప్పిస్తున్నామని, విభజన హామీల లో భాగంగా ఇరు రాష్ట్రాల మధ్య సమస్యలపై సయోధ్య కుదుర్చుకునేందుకు తెలంగాణ సిఎం సమావేశమై మరొక అడుగు ముందుకు వేశామని తెలిపారు. పోలవరంలో అవకతవకలపై అధ్యయన కమిటీ ఏర్పాటు చేసి లోపాలను రాష్ట్ర ప్రజలకు వివరించారని తెలిపారు. భోగాపురం విమానాశ్రయాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేటందుకు ప్రణాళికలు రచిస్తున్నారని, పట్టిసీమ నీటిని కృష్ణమ్మ చెంతకు తెచ్చి రైతాంగానికి నీటి కష్టాలను తీర్చిస్తున్నారని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16347 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారని, రాజధాని అమరావతి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్ల పాలనా ఇలాగే ప్రశ్నించేలని విధంగా ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు సిఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు. చంద్రబాబుతోనే రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. మాచర్ల నియోజకవర్గంలో కూడ చంద్రబాబు నాయకత్వంలో జూలకంటి బ్రహ్మారెడ్డి అభివృద్ధికి విశేష కృషి చేస్తారని అన్నారు.



ఓటింగ్ విధానం పై విద్యార్థుకు అవగాహన

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని గుడ్ షెఫర్డ్ హైస్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం ఎన్నికలపై అవగాహన కల్పించారు. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఇన్నారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటింగ్ పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థులకు నమూనా పోలింగ్ నిర్వహించి తద్వారా ఓటింగ్, ఎన్నికల విధానం వివరించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలకు ఓటర్లు ఓటు హక్కును ఎలా వినియోగించుకుంటారో ఆ విధంగా బ్యాలెట్ పేపర్లు, ఏజెంట్లు, డైరెక్ట్ బాక్స్, బ్యాలెట్ పేపర్ పై ఓటు ముద్ర అంశాలన్నీ వివరించారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు ఉత్సాహంగా ఎన్నికల్లో పాల్గొన్నారు. నామినేషన్లు దాఖలు చేయడం, బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడం, ఓట్ల లెక్కింపు, ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

అన్నా క్యాంటీన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - మాచర్ల

రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించనున్న అన్నా క్యాంటీన్లలో మరమ్మతులపై కమిషనర్ డి.వెంకటదాసు శుక్రవారం పరిశీలించారు. అన్నా క్యాంటీన్లను ప్రారంభించే వరకు పట్టణ ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్‌లో ఉచితంగా అన్నదాన కార్యక్రమం కొనసాగుతుంది.

విను'కొండ తిరుణాళ్ల'పై కలెక్టర్, ఎమ్మెల్యే సమీక్ష




సమీక్షలో మాట్లాడుతున్న పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి - వినుకొండ

తొలి ఏకాదశి సందర్భంగా వినుకొండలో ఈనెల 17న జరిగే శ్రీరామలింగేశ్వర స్వామి (కొండ) తిరుణాళ్ల ఏర్పాట్లపై స్థానిక మున్సిపల్ హాల్లో వివిధ శాఖల అధికారులతో పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శుక్రవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రుణాళ్లకు లక్షల సంఖ్యలో సందర్శకులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని, ఎవరూ అసౌకర్యానికి గురవ్వకుండా సదుపాయాలన్నీ కల్పించాలని సూచించారు. కొండపైకి ఘాట్ రోడ్డు మార్గాన ఎక్కే వారి సౌకర్యార్థంగా భారీ గేట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి 250 మీటర్లకు తాగునీటి వసతి కల్పించాలని, దేవాలయ పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొండపై నిర్వహించే అఖండ జ్యోతి కార్యక్రమానికి బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. మొబైల్ టాయిలెట్స్, పారిశుధ్య ఏర్పాట్లు చేయాలన్నారు. కొండపై సందర్శకులు వెళ్లడానికి కండీషన్‌తో కూడిన బస్సులను ఆర్‌టిసి ఏర్పాటు చేయాలని, బస్సులు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీరు ఏర్పాట్లు, భక్తులకు భోజన సదుపాయం, అన్నదాన ప్రసాదాలు, ఘాట్ రోడ్‌లో వాహన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. తిరునాళ్ల రియల్ ఎస్టేట్ భూముల్లో కాకుండా, వినుకొండ ఊర్లోనే జరుగుతుందని, ఎలక్ట్రికల్ ప్రభలకు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంఘిక, పౌరాణిక నాటకాలు, నాటికలకు అనుమతులిచ్చి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ ప్రభల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో, కొండ వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని సూచించారు. తొలి ఏకాదశి కొండ తిరునాళ్ల, మొహరం పండుగలు ఒకేరోజు వచ్చాయని, ఎవరికీ ఇబ్బందులు లేకుండా హిందువులు, ముస్లిములు పండుగలు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నరసరావుపేట ఆర్‌డిఒ, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, పంచాయతీరాజ్, పోలీస్, మున్సిపాలిటీ, ఆర్ అండ్ బి, వైద్య , విద్యుత్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు.

రాయితీపై బియ్యం, కందిపప్పు విక్రయం ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



బియ్యం, కందిపప్పు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట పట్టణంలోని శివునిబొమ్మ సెంటర్‌లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా శుక్రవారం రాయితీపై కందిపప్పు, బియ్యం విక్రయాలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. బహిరంగ మార్కెట్ లో ప్రస్తుతం ఫైన్ రకం (స్టీము రైస్) కిలో రూ.55.85 ఉండగా రూ.49కు, ఫై రకం (ముడి లేదా రా రైస్) రూ.52.40 ఉండగా రూ.48కు, దేశవాళి కందిపప్పు కిలో రూ.174 ఉండగా రూ.160కు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా పౌర సరఫరాల అధికారి ఎస్.పద్మశ్రీ మాట్లాడుతూ ఒక్కొక్కరికి బియ్య ఐదు కిలోలు, కందిపప్పు కిలో చొప్పున విక్రయిస్తామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, పల్నాడు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఊరా భాస్కరరావు మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన బియ్యం అందించేందుకు తమ అసోసియేషన్ కృషి చేస్తుందని అన్నారు. ప్రస్తుతం ధాన్యం కొరత ఏర్పడడంతో బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో వినియోగదారులపై భారం తగ్గించేందుకు లాభాపేక్ష లేకుండా సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఇదిలా ఉండగా పిడుగురాళ్ల పట్టణంలో వాసవి కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో ప్రత్యేక కౌంటర్‌ను తహసిల్దార్, పిడుగురాళ్ల పట్టణ రైస్ మిల్లర్ల అధ్యక్షులు గుండా రామారావు కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డిఆర్ఒ సరోజినీ, తహశీల్దార్ ఎం.హరిబాబు, పౌర సరఫరాల డిప్యూటీ తహశీల్దార్ ఐనవోలు రమేష్, పల్నాడు జిల్లా రైస్ మిల్లర్ల ప్రతినిధులు, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.విజయ్ కుమార్, ఐవిఎఫ్ యువజన విభాగం నాయకులు ఎ.సుబ్బారావు పాల్గొన్నారు.



అమ్మ పేరుతో వందలాది మొక్కలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : రొంపిచర్ల మండలంలో వి.రెడ్డిపాలెం ఎపి మోడల్ స్కూల్‌లో శుక్రవారం అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, వారి తల్లులు అమ్మ పేరుతో వందలాది మొక్కలు నాటారు. ఈ కార్యక్రమమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవి నాయక్ మాట్లాడుతూ మొక్కలు నాటటం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-ఈపూరు : నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖాధికారి ఎస్ గాంధీ బాబు శుక్రవారం తెలిపారు. ఈపూరు, ఎ.ముప్పాళ్ల, కొచ్చర్ల, ఊడిజర్ల విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని, వ్యవసాయ అవసరాల కోసం రాత్రి 12 గంటల నుండి ఉదయం 9 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు.

టిడ్కో ఇళ్ల లబ్ధిదార్లకు త్వరలో మంచి రోజులు

- **మిగిలిన 2 వేల ఇళ్ల నిర్మాణమూ పూర్తి చేస్తాం**
- **గతంలో ఇబ్బందులు పెట్టిన వారిపై కఠిన చర్యలు : ఎంపి, ఎమ్మెల్యే**



లబ్ధిదార్లతో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చిలకలూరిపేట

టిడ్కో ఇళ్ల లబ్ధిదార్లకు త్వరలోనే మంచి రోజులొస్తాయని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక పట్టణ పరిధిలో 52 ఏకరాలలో నిర్మించి ఇచ్చిన టిడ్కో గృహ సముదయాలను వారు శుక్రవారం సందర్శించి అక్కడివారితో సమావేశమయ్యారు. 4,500 టిడ్కో గృహాలను టిడిపి హయాంలో అందించగా తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం దౌర్జన్యం, అవినీతి, అరాచకాల వల్ల కనీసం గృహ ప్రవేశాలు చేయించలేదని విమర్శించారు. ఫలితంగా అద్దె ఇళ్లలో ఉండేవారు అద్దెల భారం, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నవారు వడ్డీలు మోయలేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లోన్లు తీసుకున్న వారిపై బ్యాంకర్లు కూడా ఒత్తిడి పెంచుతుంటే ఏం చేయాలో పాలుపోని స్థితిలో పడిపోయారన్నారు. ఇకపై ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకునే బాధ్యత తమదన్నారు. ముందుగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేయాలని, పోలీస్ అవుట్‌పోస్ట్ పెట్టాలని, ఆస్పత్రి, పాఠశాల, వార్డు సచివాలయం, కార్డులను ఇక్కడి అడ్రస్‌తో మార్చడం వంటివి చేపడతామన్నారు. బోరు, లైట్లు వేయిస్తామన్నారు. ఇంతకాలం లబ్ధిదారుల్ని బెదిరించిన వారిపైన, టిడ్కో ఇళ్లవద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. టిడిపి హయాంలో పునాది దశకు వచ్చిన మరో 2 వేల ఇళ్లనూ పూర్తిచేసి లబ్ధిదార్లకు ఇస్తామని చెప్పారు. లబ్ధిదార్లు తమ దృష్టికి తెచ్చిన సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. ఇళ్లను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు టి.సుబ్బారావు, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త టి.రాజారమేష్, అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ కొల్లా అమర్‌కు పరామర్శ

పట్టణంలోని ప్రముఖ పిల్లల వైద్యులు కొల్లా అమర్ కాలికి ఇటీవల ఆపరేషన్ జరిగిన నేపథ్యంలో ఆయన్ను ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, శుక్రవారం పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని, పేదలకు మరింతగా వైద్యసేవలు అందించాలని ఆకాక్షించారు.

గృహ నిర్మాణంపై సూచనలు

ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావును గృహ నిర్మాణ శాఖ డిఇ వెంకటేశ్వరరావు కలిశారు. గత ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణ పురోగతిపై నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట ఎఇలతో సమీక్షించారు. అస్తవ్యస్తంగా ఉన్న గత ప్రభుత్వ విధానాలను పక్కనపెట్టి పేదలందరికీ పక్కా ఇళ్లు కట్టించాలని ఎమ్మెల్యే సూచించారు.

ఆ ఘటనలో ఎమ్మెల్యే భార్యకు ఏం సంబంధం?

ఎన్నికల్లో ఎమ్మెల్యే పుల్లారావు విజయాన్ని చూసి వైసిపి అసూయపడుతోందని, అందుకే ఆయన కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని జనసేనపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్ విమర్శించారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గోపాలవారిపాలెంలో జరిగిన సంఘటనకు ఎమ్మెల్యే పుల్లారావు భార్యకు సంబంధమేమిటని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ని విమర్శించే అర్హత వైసిపి వారికి లేదన్నారు. మాజీ మంత్రి విడదల రజిని అవినీతిపై వైసిపి నాయకులు ఎందుకు మాట్లాడటం లేదన్నారు.

మురుగు కాల్వల్లో సిల్టు తీయించండి

స్థానిక పురుషోత్తపట్నంలో నెలకొన్న సమస్యలను త్వరగతిన పరిష్కరించాలని కమిషనర్ గోవిందరాజును జనసేన పార్టీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త టి.రాజరమేష్ కోరారు. పురుషోత్తపట్నంలో పర్యటనకు వచ్చిన కమిషనర్‌ను రాజారమేష్ కలిశారు. మురుగు కాల్వల్లో సిల్ట్ తొలగించని కారణంగా వర్షాలప్పుడు మురుగు నీరు రోడ్లపైకి వచ్చి ప్రజలు అవస్థ పడుతున్నారని చెప్పారు. పుల్లారావు ఆధ్వర్యంలో పట్టణాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షేక్ సుభాని, మునీర్ హసన్, సాంబ, శివశంకర్, అవినాష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఈ రోడ్లు వేసేది ఎప్పుడో..

ప్రజాశక్తి - మంగళగిరి





మంగళగిరి పట్టణంలో 2020 నుండి నూతన వాటర్ పైప్ లైన్లను పట్టణమంతా వేశారు. తాగునీరు సకాలంలో అందించి మీటర్ల బిగించి, నీటి పన్ను వేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం సిమెంట్ రోడ్లు మధ్యలో పగలగొట్టి పైపులైన్ వేశారు. పట్టణ మంతా ఇదే విధంగా పగల గొట్టడం జరిగింది. వాహన దారులు, నడుచు కుంటూ వెళ్లే ప్రజలు ప్రతిరోజు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు పగల గొట్టి ఇన్ని సంవత్సరాలైనా ఇంతవరకు రోడ్లు వేయలేదు, మరమ్మతులు చేయలేదు. టిడిపి నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ నెల రోజులు అధికారులను బదిలీలు చేసే పనిలో ఉన్నారు. ఇంకా బదిలీలు కొనసాగుతూనే ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ప్రజలు అనేక సంవత్సరాలుగా పడుతున్న గుంతపడ్డ రోడ్లను కొత్తగా నిర్మాణం చేస్తారా.. లేక మరమ్మతులు చేస్తారనేది అర్థం కావడం లేదు. కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి ఈ రోడ్ల పరిస్థితిని గమనించి రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగదారులకు సక్రమంగా అందని రేషన్

అధికారులు పట్టించుకోవాలని కోరుతున్న ప్రజలు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



గత వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటికి రేషన్ ఇటీవల కాలంలో సరిగా పంపిణీ జరగడం లేదని విని యోగదారులు గగ్గోలు పెడుతున్నారు. తాడేపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు అందించే రేషన్ అందడం లేదని అధికారులు కూడా పర్యవేక్షణ చేయడం లేదని ప్రజలు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. నెలలో 15 రోజులు ఇచ్చే రేషన్ ఏ వీధికి సరిగా రావడం లేదని తెల్ల రేషన్ కార్డుదారులు ఆందోళన చెందుతున్నప్పటికీ, ఏ ఒక్క ప్రభుత్వ అధికారి పట్టించుకున్న పాపాన పోలేదని, గత ప్రభుత్వ హయాములో నెలలో ఒకటవ తేదీ నుండి 15వ తేదీ వరకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా, రేషన్ డీలర్ల వద్దనుండి ఎం డి యు లు రేషన్ బియ్యాన్ని నింపుకొని, వీధి వీధికి తిరిగి రేషన్ పంపిణీ చేసేవారని స్థానికులు తెలుపుతున్నారు. గత కొద్ది రోజులుగా ఎం డి యు లు అరా కోరా గా 15, 20 కార్డు దారులకు మాత్రమే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసి, వాహనాలను నిలుపుదల చేస్తున్నారని గ్రామస్తులు, వినియోగదారులు వాపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే నిత్యవసర వస్తువులు పంపిణీ చేసే పథకం ఇక అటకెక్కిందేమోనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ సంబంధిత అధికారులు సమస్యను పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. అదే విధంగా ఎం డి యు (రేషన్ పంపిణీ చేసే వాహన దారులకు జీతాలు సరిగా అందక నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారా? సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివసించే తాడేపల్లి మండలం, మంగళగిరి నియోజకవర్గంలో ప్రజా పంపిణీ వ్యవస్థ పరిస్థితి ఇలా ఉంటే, ఇంటింటికి పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని నిలుపుదల చేస్తారా? మళ్లీ రేషన్ డీలర్ల వద్దకే వెళ్లి తెచ్చుకోవాలా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా రేషన్ సకాలంలో పంపిణీ చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దౌర్జన్యంగా నిర్మించిన షాపును తొలగించాలని ఆందోళన

స్పందించిన పోలీసులు, మున్సిపల్ అధికారులు

వైసిపి అనుకూలంగా ఉన్నామని దౌర్జన్యం : షాపు యజమాని

ప్రజాశక్తి-తెనాలి



షాపు వద్ద ఆందోళన కారులకు సర్దిచెబుతున్న పోలీసులు

మున్సిపల్, పిడబ్ల్యూడి స్థలం ఆక్రమించి షాపు కట్టాడని దానిని తక్షణమే తొలగించాలని స్థానికులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసులు అప్రమత్తం కావటంతో గొడవ సద్దుమణిగింది. స్థానికులు, మున్సిపల్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం స్థానిక నందులపేట డాంగేవారి వీధిలో గత ప్రభుత్వ హయాంలో అదే ప్రాంతానికి నరేంద్రకుమార్ మున్సిపల్, పిడబ్ల్యూడి స్థలంలో షాపులు నిర్మించి శ్రీహరి జనరల్ అండ్ ఫ్యాన్సీ స్టోర్స్ పేరిట వ్యాపారం చేస్తున్నాడు. అయితే తాజాగా స్థానికులు షాపు అక్రమ నిర్మాణంపై మున్సిపల్ అధికారులకు పిర్యాదు చేశారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు గతనెల 15న షాపును తొలగించాలని మౌఖికంగా ఆదేశించారు. దీంతో నరేంద్రకుమార్ కోర్టును ఆశ్రయించి స్టేటస్ కో పొందాడు. ఈ నేపథ్యంలో స్థానికులు కొందరు శుక్రవారం షాపు ముందు టెంట్ వేసి ఆందోళన చేశారు. నరేంద్రకుమార్ వైసిపి అండతో తమను దౌర్జన్యంగా కాళీ చేయించి, ఎలాంటి అనుమతులు లేకుండా షాపులు నిర్వహిస్తున్నారని, దానిని తక్షణమే తొలగించి షాపు నిర్మాణానికంటే ముందు ఆస్థలంలో నివసించిన వారికే ఆ స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారుల్లో కొందరు షాపులో వస్తువులను, నిలిపి ఉంచిన వాహనాలపై దాడులు చేశారు. అయితే నరేంద్రకుమార్ మాత్రం 1989 నుంచి అదే స్థలంలో ఉంటున్నామని, మున్సిపాలిటికి ట్యాక్స్‌కూడా చెల్లిస్తున్నామని, వైసిపికి అనుకూలంగా ఉన్నామన్న కారణంగా కూటమి నాయకులు దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఏసిపి-1 జడ్ సుధాకర్ మాట్లాడుతూ ఆక్రమణ తొలగించాలని నరేంద్రకుమార్‌ను గత నెల 15న చెప్పామని, తొలగిస్తానని చెప్పి కోర్టును ఆశ్రయించాడన్నారు. స్టేటస్ కో పై ఈనెల 25న కోర్టులో విచారణ ఉందని, అప్పటికి పురపాలక సంఘం నుంచి కోర్టుకు పరిస్థితిని వివరించి, కోర్టు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. అయినా ఆందోళనకారులు సమ్మతించకపోవటంతో షాపుకు తాత్కాలికంగా పురపాలక సంఘం అధికారులు తాళం వేయించారు. దీంతో గొడవ సద్దుమణిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పట్టణ ఒన్‌టౌన్ సిఐ దశరధరామయ్య బందోబస్త్ నిర్వహించారు.

డివిఎంసి సభ్యునిగా రాజారావు నియామకం

ప్రజాశక్తి - మంగళగిరి

తెనాలి డివిజన్ విజిలెన్స్ అండ్ మానటరింగ్ ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యునిగా మంగళగిరి బాప్టిస్ట్ పేటకు చెందిన బుల్లా రాజారావును నియమిస్తూ శుక్రవారం తెనాలి సబ్ కలెక్టర్ ప్రకాష్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. బుల్లా సభ్యునిగా రెండు సంవత్సరాలు పాటు కొనసాగుతారు. ప్రస్తుతం రాజారావు జిల్లా లెవెల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యునిగా ఈనెల 31తో పదవీకాలం ముగుస్తుంది. బుల్లా తిరిగి డివిజినల్ విజిలెన్స్ అండ్ ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యునిగా నియమితులవటం విశేషం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో ఎస్సీ, ఎస్టీలపై ఉన్న కేసులు సత్వరమే పరిష్కారం అయ్యేటట్లు, ఎస్సీ ఎస్టీ బాధితులకు ప్రభుత్వం నుండి అందవలసిన నష్టపరిహారం సకాలంలో అందే విధంగా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ హాస్టల్లోని హాస్టల్స్ లోని సమస్యలు పరిష్కారాన్ని కూడా తన వంతు కృషి చేస్తానని బుల్లా రాజారావు తెలిపారు.


ఎస్ఎఫ్ఐ ఫిరంగిపురం మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఫిరంగిపురం : ఎస్ఎఫ్ఐ ఫిరంగిపురం నూతన మండల కమిటీని ఎన్నుకున్నట్టు ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ తెలిపారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కె దైవ సహాయం, ఎస్.కె షరీఫ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ప్రతాప్, సహాయ కార్యదర్శిగా ఉదయ్ కుమార్ మోహన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ మాట్లాడుతూ డిగ్రీ అడ్మిషన్ లో ఆన్లైన్ విధానాన్ని రద్దు చేయాలని ఆఫ్ లైన్ లోనే నిర్వహించాలని కోరారు . ఆన్లైన్ విధానం వల్ల డిగ్రీ కళాశాలలో ఇప్పటివరకు పూర్తి స్థాయిలో అడ్మిషన్లు కాలేకపోతున్నాయని అన్నారు. నూతన ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేసినట్లు ప్రతి విద్యార్థికి తల్లికి వందనం కింద రూ.15 వేలను ఇవ్వాలని క్రింది స్థాయి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె పవన్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఏ యశ్వంత్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



హత్యాయత్నం కేసులో ఒకరు అరెస్టు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ :ఆర్థిక సంబంధాల నేపథ్యంలో హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ టౌన్ గుణదలకు చెందిన తుళ్లూరి కళ్యాణ్ అలియాస్ సన్నీ, మంగళగిరి మండలం పెదవడ్లపూడికి చెందిన మెరుగోలు క్రాంతికుమార్‌కు గత కొంత కాలంగా ఆర్థిక అంశాల్లో మనస్పర్థలు న్నాయి. ఈ క్రమంలో 10వ తేదీన నిందితుడు కళ్యాణ్ పథకం ప్రకాకం క్రాంతికుమార్‌ను హత్య చేయాలని విజయవాడనుండి కొబ్బరిబొండాలు నరికే కత్తితీసుకుని వచ్చాడు. క్రాంతికుమార్‌కి ఇవ్వాల్సిన నగదు ఇస్తానని నమ్మించి బండిపై తీసుకువెళ్లి పెదవడ్లపూడి సమీపంలోని జగనన్న కాలనీ వద్ద నిర్మానుష్యంగా ఉండే ప్రదేశంలోకి తీసుకువెళ్లి, మద్యం తాగాలని మాటల్లోకి దింపి కత్తితో దాడి చేయగా, క్రాంతి కుమార్ తప్పించుకోగా, తన తల వెనుక భాగాన మరియు మెడ వెనుక భాగంలో కత్తి ఘాట్లు కలిగి తీవ్ర రక్తస్రావం అయినా క్రాంతికుమార్ తప్పించుకున్నాడు. అతన్ని బంధువులు ఎన్ఆర్ఐ హాస్పిటల్‌కు తరలించగా ప్రస్తుతం చికిత్స చేస్తున్నారు. ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. క్రాంతి కుమార్ ఫిర్యాదు పై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి నేర విచారణ అనంతరం శుక్రవారం నిందితుడు కళ్యాణ్‌ను ఆత్మకూరు జంక్షన్ సమీపంలో అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామని, కోర్టు 14రోజులు రిమాండ్ విధించిందని పోలీసులు తెలిపారు.



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : విద్యుత్ లైన్లు మరమ్మతులు కారణంగా తెనాలి పట్టణ అలాగే గ్రామీణ పరిసర ప్రాంతాల్లో అన్ని ప్రదేశాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 02:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎపిసిపిడిసిఎల్ ఆపరేషన్ సబ్ డివిజన్ తెనాలి టౌన్ డిఈఈ అశోక్ కుమార్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ : పెదనందిపాడు సబ్ స్టేషన్, వరగాని సబ్ స్టేషన్ పరిధిలో గల వరగాని, అబ్బినేనిగుంటపాలెం, జి.జి.పాలెం, రావిపాడు మరియు గోగులమూడి గ్రామాలకు, కాకుమాను సబ్ స్టేషన్ పరిధిలో గల పమిడి వారిపాలెం, పుసులూరు గ్రామాలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నము2.గంటల వరకు విద్యుత్ లైన్ ల మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల నిమిత్తం విద్యుత్ నిలిపి వేయ బడుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బి వీరాంజనేయులు తెలిపారు.

ప్రజాశక్తి - చేబ్రోలు : ప్రజాశక్తి చేబ్రోలు సబ్ స్టేషన్‌ల పరిధిలో రెండు గంటలపాటు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఏపీసిపి డి సి ఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ పి వెంకట సుధీర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేదోడి ఇంటికి శంకుస్థాపన

ప్రజాశక్తి-తాడేపల్లి



రాజధానిలో భాగమైన పెను మాకలో బాణావతు పాములు నాయక్ పేదోడి ఇంటికి శుక్రవారం టిడిపి నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ నెల ఒకటో తేదీ పింఛన్ల పంపిణీ సందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు మొదటి పింఛను నాయక్ కుటుంబానికి అందజేశారు. అతనికి సొంతిల్లు కూడా లేక పోవడంతో పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని ఆనాడు హామీ నిచ్చారు. అందులో భాగంగా శుక్రవారం పాములు నాయక్ కుటుంబంతో పాటు టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు అమరా సుబ్బారావు, కొల్లి శేషు, పెనుమాక అధ్యక్షులు పి.వీరేంద్రనాథ్, మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు కళ్లం రాజశేఖరరెడ్డి, కళ్లం ఫౌండేషన్ చైర్మన్ కళ్లం శివగోవిందరెడ్డి, గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, కృష్ణవందన పాల్గొన్నారు.



విద్యార్థులతో మాజీ సైనికుడు రవి, గ్రామ ఉపసర్పంచ్ నాగభూషణం

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్ :అంగలకుదురు మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శుక్రువారం మాజీ సైనికుడు నలుకుర్తి రవి ఆధ్వర్యంలో 40 మంది ఎస్సి విద్యార్థులకు నోట్ బుక్స్, పలకలు, జామెంట్రీ బాక్సులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో అంగలకుదురు ఉపసర్పంచ్ కనకాల నాగభూషణం, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, టిడిపి ఎస్సి సెల్ నాయకులు శుద్ధపల్లి నాగరాజు, అత్తోట శరత్, రాజారాం పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ

ప్రజాశక్తి - తెనాలి : మద్యం మత్తులో బార్ యాజమాన్యంతో ఘర్షణకు దిగిన వ్యక్తి పై త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురజాల కు చెందిన మణి కుమార్ గురువారం రాత్రి ఇరువురు మిత్రులతో కలిసి రైల్వే స్టేషన్ సమీ పంలోని ఓ బార్లో మద్యం సేవించారు. ఇరువురు మిత్రులు మధ్యలోనే అక్కడి నుంచి ఉడాయించగా, బిల్లు చెల్లించే భారం మణి కుమార్ పై పడింది. అతను కూడా జారుకునే ప్రయత్నం చేయగా బార్ సిబ్బంది అతనిని అడ్డుకున్నారు. దీంతో వారితో మణి కుమార్ ఘర్షణ పడ్డాడు. బార్ సిబ్బంది ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

విజ్ఞాన్స్‌లో డార్లింగ్ సినిమా యూనిట్ సందడి

ప్రజాశక్తి-గుంటూరు



యూనివర్సిటీలో చిత్ర యూనిట్

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శుక్రవారం సినీహీరో ప్రియదర్శి తన 'డార్లింగ్' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా సందడి చేశారు. కార్యక్రమంలో హీరో ప్రియదర్శి, హీరోయిన్ నభానటేష్, దర్శకుడు అశ్విన్‌రామ్, ఇతర సినిమా సిబ్బంది పాల్గొన్నారు. ఈ చిత్రాన్ని ప్రైమ్ షో ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్స్‌పై కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి 'డార్లింగ్ ' సినిమాను నిర్మించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సినీహీరో ప్రియదర్శి మాట్లాడుతూ విద్యార్థులే నాబలగమని పేర్కొన్నారు. ఈనెల 19న సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందన్నారు. విద్యార్థులందరూ డార్లింగ్ సినిమాను ఆదరించి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. ఈ చిత్రాన్ని స్ప్లిట్ పర్సనాలిటీ అనే డిజార్డను ఆధారంగా చేసుకుని రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించామన్నారు. ఈ సినిమాలో రొమాంటిక్ కామెడీ, యాక్షన్ ఎపిసోడ్స్, ఎమోషన్స్, డ్రామా ప్రేక్షకులందరికీ నచ్చు తాయన్నారు. ఈ సినిమాకి అశ్విన్‌రామ్ దర్శకత్వం వహించగా, మ్యూజిక్ డైరెక్టర్‌గా వివేక్‌సాగర్, డీవోపీ నరేష్ రామదురై, ఎడిటర్‌గా ప్రదీప్ రాఘవ్ పనిచేశారని తెలిపారు. సినిమా హీరోయిన్ నభా నటేష్ మాట్లాడుతూ ఈ సినిమా తన మనసుకు బాగా దగ్గరైన సినిమా అని తెలియజేశారు. ఈ సినిమాలో తన పాత్ర ఇప్పటివరకు చేసిన పాత్రల కంటే వైవిధ్యభరితమైందన్నారు. అనంతరం డార్లింగ్ సినిమా యూనిట్ బృందాన్ని విజ్ఞాన్స్ విద్యా సంస్థల వైస్‌చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు అభినందించి చిత్రం అఖండ విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాంద్‌బాషా

ఉద్యోగులు, పెన్షనర్లకు ఐఆర్ ప్రకటించాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు ఐఆర్ (మధ్యంతర భృతి) ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా కోరారు. శుక్రవారం నగరం పాలెంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగులకు రివర్స్ పిఆర్‌సి ఇచ్చి మోసం చేసిందని, 2023 జులై 1 నుండి ఇవ్వాల్సిన పిఆర్‌సి ఇవ్వకుండా, ఇప్పటికీ 13 నెలలు నష్టపోయామన్నారు. కమీషన్ నియమించి ఐ.అర్. కూడా ప్రకటన చేయకుండా గత ప్రభుత్వం దగా చేసిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ఈనెల 16న జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన మధ్యంతర భృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు చాంద్‌బాష, జిల్లా కార్యదర్శి శివారెడ్డి, నగర అధ్యక్షులు నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు రహిమాన్, కోశాధికారి పోతురాజు, మహిళా విభాగం సహాధ్యక్షురాలు, హేమలత, మహిళా విభాగం ఆర్గనైజింగ్ కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అర్ధరాత్రి తనిఖీలు

బయటపడ్డ ఈసిజి టెక్నిషియన్‌ల పని తీరు - ఈసిజి రోల్స్ బయటకు వెళుతున్నాయి : సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రోగులు, వారి సహాయకులు ఫిర్యాదుల మేరకు ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం అర్ధరాత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాత్రి 11 గంటల నుంచి ఒంటి గంట వరకు ఆసుపత్రిలో అత్యవసర చికిత్స విభాగాలను ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో పలు విభాగాల్లో అధికారులు, ఉద్యోగులు పనితీరుసరిగా లేదని ఆయన గుర్తించారు. వైద్యులకు, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్యాజువాల్టి రిజిస్ట్రేషన్ కేంద్రం వద్ద ఇద్దరు అవసరం ఉండగా ఒకరిని మాత్రమే సంబంధిత కాంట్రాక్టు ఏజెన్సీ వినియోగిస్తుందని గుర్తించారు. గత ఆరు ఏడు నెలల నుంచి ఈ సి జి తీసే సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. ఇద్దరు ఉండాల్సిన చోట ఒక్కరే ఉంటున్నారు. ఒకరు ఉంటే మరొకరు అర్ధరాత్రి నుంచి విధులకు డుమ్మా కొడుతున్నట్లు తనిఖీల్లో వెల్లడయింది. ఈ సి జి రీల్స్ లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఆయన పరిశీలించారు. ప్రతిరోజూ ఈ సి జి రోల్స్ ఎవరూ ఇస్తున్నారు.. ఇండెంట్ ఎవరు ఇస్తున్నారు.. ఎవరీ ద్వారా తీసుకుంటున్నారు అనే అంశాలపై విచారణ చేపట్టాలని అధికారులకు ఆదేశించినట్లు ఆయన చెప్పారు. ఈ సి జి రోల్స్ బయటకు తీసుకుని వెళ్లి దందా చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని సూపరింటెండెంట్ అధికారులకు వివరించారు. దీనిపై వెంటనె విచారణకు ఆదేశించినట్లు ఆయన తెలిపారు.



జిజిహెచ్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ కిరణ్ కుమార్

అత్యవసర చికిత్స విభాగంలో అనధి.కారికంగా తిరుగుతున్న ల్యాబ్ టెక్నిషియన్‌ను గమనించినట్లు ఆయన చెప్పారు. అమాయక రోగుల వద్ద ల్యాబ్ పరీక్షల పేరిట ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారని రోగుల సహాయకులు ఫిర్యాదు చేసారని ఆయన తెలిపారు. ల్యాబ్ టెక్నిషియన్‌ల వద్ద వేరే వ్యక్తులు ఉండటంతో వెంటనే గమనించి ఔట్ పోస్ట్ పోలీసులకు అప్పగించినట్లు ఆయన చెప్పారు. ట్రయిల్ రన్‌లో ఉన్న సిటీ స్కాన్ మిషన్‌ను ఆయన పరిశీలించారు. సర్వీస్ ఇంజనీర్‌తో మాట్లాడి వెంటనే రోగులకు అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ ఆసుపత్రిని తనిఖీ చేస్తారని, మిషన్‌ను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆధునిక కేర్ యూనిట్ ను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విశ్రాంత ఉద్యోగి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసు కోవాలని ఆయన ఆదేశించారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-గుంటూరు

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో మలాల డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా గరల్స్ కన్వీనర్ బి.సుచరిత, నగర గరల్స్ కన్వీనర్ ఆరిఫా మాట్లాడుతూ బాలికా విద్య కోసం మలాల చేస్తున్న కృషిని విద్యార్థినులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చిన్నతనంలో చదువుకోవాలనే సంకల్పంతో బడికి వెళుతుంటే తనపై ఉగ్రవాదులు దాడి చేసినా చదువు మాత్రం ఆపకుండా ఉన్నత చదువులు చదువుతుందన్నారు. అతి చిన్న వయసులో నోబుల్ బహుమతి పొంది, ఒక పుస్తకం, ఒక కలం, ఒక టీచర్, ఒక క్లాస్‌రూమ్, ఒక విద్యార్థి, ఈ ప్రపంచాన్ని మారుస్తారనే నినాదంతో ప్రపంచ దేశాలను ఆకర్షించారన్నారు. ఇప్పటికీ భారతదేశంలో బాలికల అక్షరాస్యతా శాతం చాలా తక్కువగా ఉందని ఎప్పుడైతే దేశంలో వందశాతం అమ్మాయిలు చదువుకుంటారో అప్పుడే ఈ దేశానికి నిజమైన స్వతంత్రం వస్తుందన్నారు. బాలికల విద్య కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు బాలికలను విద్యకు దూరం చేసే విధంగా ఉన్నాయన్నారు. పాఠశాలల మూసివేత ప్రక్రియ నిలిపివేయాలన్నారు. డిగ్రీలో అనేక మార్పులు చేయటం వల్ల కూడా ఎక్కువమంది చదువుకోలేకపోతున్నారని, ఫీజుల భారం పెరుగుతున్నా వాటిని అధిగమించడంలో ప్రభుత్వాలు నోరు మెదపట్లేదన్నారు. ఎప్పటికైనా బాలికల విద్యను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని కోరారు.



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా గరల్స్ కన్వీనర్ సుచరిత

ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

48మంది పేద విద్యార్థులకు విట్‌లో ఉచిత ప్రవేశం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన 48 మంది గ్రామీణ నిరుపేద విద్యార్థులకు రాజధాని అమరావతి లోని విఐటి విశ్వవిద్యాలయంలో ఉచిత ప్రవేశం లభించింది. స్టార్స్ (సపోర్ట్ ది అడ్వాన్స్ మెంట్ ఆఫ్ రూరల్ స్టూడెంట్) పథకం ద్వారా విద్యార్థులు ఉచిత ప్రవేశాన్ని పొందారు. ఇంటర్‌లో టాపర్‌లుగా నిలిచిన పేద విద్యార్థులకు స్టార్స్ పథకం ద్వారా విశ్వ విద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించేటందుకు అవకాశం కల్పించటం జరిగింది. ఈ పథకం ద్వారా ఎంపికైన విద్యార్థులకు విద్య, హాస్టల్ సౌకర్యాలలో 100శాతం ఫీజు రాయితీని కల్పిస్తారు. మొదట ఈ పథకం తమిళనాడులోని వెల్లూరులోని విఐటి విశ్వవిద్యాలయంలో 2008లో వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ జి. విశ్వనాథన్ ప్రారంభించారు. తదుపరి విఐటి చెన్నై, విఐటి-ఏపి , విఐటి-భోపాల్ క్యాంపస్ లకు విస్తరించింది. ఈ సందర్భంగా శుక్రవారం విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్ వి కోటా రెడ్డి మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు విద్య సరైన ఆయుధం అని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని అతి సామాన్యమైన



ఉచిత ప్రవేశం పొందిన విద్యార్థులతో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్ వి కోటా రెడ్డి, రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి తదితరులు

కుటుంబాల నుండి వచ్చిన ప్రతిభావంతమైన విద్యార్థులకు నాణ్యమైన ఉన్నతవిద్యను అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచి సమాజానికి అందించే అద్భుతమైన పథకమే స్టార్స్ పథకమని అన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదుగంటి మాట్లాడుతూ అర్హులైన ప్రతి విద్యార్థికి వారి కలలను సాకారం చేసుకునేందుకు అవకాశం ఉంటుందని వారి కలలు సాకారం అయ్యేలా విఐటి విశ్వవిద్యాలయం ఎప్పుడూ అండగా నిలుస్తుందని చెప్పారు. సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపడానికి విద్యే చక్కటి పరిష్కారమని అన్నారు. ఉన్నత విద్య ద్వారా విఐటి-ఎపి విశ్వ విద్యాలయం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోందన్నారు. కార్యక్రమంలో అడ్మిషన్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జాన్ ప్రదీప్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ కుమార్ మిశ్రా స్టార్ పథకం కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకట లక్ష్మి చీఫ్ పబ్లిక్ రిలేషన్ అఫీసర్ దయానంద్ గుంటి తదితరులు పాల్గొన్నారు.